నేటి నుంచి పోషణ మాసోత్సవాలు

- తల్లీ, బిడ్డల సంరక్షణకు చర్యలు
- రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లా సమాచారం

ఐసీడీఎస్ ప్రాజెక్టులు : 3
అంగన్‌వాడీ కేంద్రాలు :919
మూడేళ్లలోపు చిన్నారులు : 25,582
3 నుంచి 6 ఏళ్లలోపు
చిన్నారులు: 21,643
గర్భిణులు: 5,306
బాలింతలు: 3,442



పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ చేయిస్తున్న నర్సంపేట సీడీపీఓ మధురిమ(ఫైల్)

నల్లబెల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం మాతాశిశువులకు పౌష్టికాహారం అందిస్తోంది. సరిగా పోషకాహారం తీసుకోకపోవడంతో నిరుపేద కుటుంబాల వారు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ్ అభియాన్ మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం రోజువారీ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించనున్నారు.

జిల్లాలోని మూడు ప్రాజెక్టుల పరిధిలో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడేళ్లలోపు 25,582 మంది, చిన్నారులు, 3 నుంచి 6 ఏళ్లలోపు 21,643 మంది చిన్నారులు, గర్భిణులు 5,306 మంది, బాలింతలు 3,442 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. 1,720 మంది చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు, 3,779 మంది తక్కువ బరువు ఉన్నట్లు, 8,540 మంది వయస్సుకు తగిన ఎత్తులేరని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు గుర్తించారు. వీరి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. పోషకాహారం లోపించిన వారు కి అదనపు ఆహారం తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

రక్తహీనత అధిగమించేందుకు..

భోజనంలో ఆకు కూరలు, పప్పు, కూరగాయలు ఉండేలా చూడాలి. బీట్ రూట్, ఖర్జూరా వంటివి తీసుకోవాలి. బెల్లం, వేరుశనగలు, రాగి జావా వంటివి తీసుకోవాలి. పాలు, ఉడికించిన గుడ్లు రోజువారీ ఆహారంలో భాగం చేయాలి. అల్పాహారంలో ఇడ్లీ, ఉప్మా, రాగిజావ, బెల్లన్నం, చపాతి లాంటివి ఇవ్వాలి. రాగి జావతో తక్కువ ఖర్చుతో మంచి పోషకాలు అందుతాయి. సీజనల్ పండు ఏదో ఒకటి రోజు ఇవ్వాలి. వైద్యులు అందించే ఐరన్ మాత్రలు వేసుకోవాలి. మంచి ఆహారం ఇస్తే పిల్లల్లో ఎదుగుదల గణనీయంగా ఉంటుంది. బాలికలకు పెళ్లి చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.

అవగాహన కల్పిస్తాం..



ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మాతాశిశు సంరక్షణ, సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ మాసోత్సవాన్ని షెడ్యుల్ ప్రకారం నిర్వహిస్తాం. అన్ని శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తాం. గర్భి ణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చు. పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదు చేయడంతో పాటు తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ కార్యక్రమాలు పారదర్శకంగా జరిగేలా ఐసీడీఎస్ అధి కారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తారు.

– రాజమణి, జిల్లా సంక్షేమ అధికారి

ఓజోన్ పొర పరిరక్షణకు పాటుపడాలి


నర్సంపేట : మాట్లాడుతున్న గోకా రామస్వామి


గీసుకొండ : డ్రాయింగ్ కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ఖానాపురం : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట: ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పర్యావరణ వేత్త, వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి, పిలుపునిచ్చారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్వయం కృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ మనం భూమి మీద నివసిస్తున్నామంటే కారణం ఓజోన్ పొర. అది మనల్ని అధిక వేడి, వాతావరణం నుంచి కాపాడుతుందని తెలిపారు. హెచ్ఎం, సంస్థ నిర్వాహకుడు కాంతారావు, ప్రభాకర్, లీడ్ గ్రంథాలయ నిర్వహకుడు కాసుల రవికుమార్ మాట్లాడారు. సోషల్ టీచర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సేవ్ ఎర్త్..సేవ్ ఓజోన్ పేరుతో విద్యార్థులు డ్రాయింగ్ కార్డులను ప్రదర్శించినట్లు హెచ్ఎం ఎండీ.రజాక్ తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి

ఖానాపురం : ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతీ ఒక్కరు తగ్గించుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కాసుల రవికుమార్ అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్‌పొర పరిరక్షణపై సూచనలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.

సఖీ సేవలు వినియోగించుకోవాలి


కాట్రపల్లిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న శోభారాణి

సంగెం : మహిళలు, బాలికలు ఆపద సమయంలో సఖీ సేవలను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో మహిళల రక్షణ చట్టాలు, సఖీ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేదని మహిళలు మహిళ హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు కాల్ చేసినట్లయితే రెస్క్యూ చేస్తామన్నారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ సెంటర్స్ 100, 181,1098, 14567 వాటిని ఉపయోగించుకోవాలన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

సంగెం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్వీ ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో రిథమ్ ఆఫ్ ప్రెషర్స్ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఏర్పచుకుని దానిని సాధించేందుకు కఠోర శ్రమపడి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. బాలబాలికలు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్

నెక్కొండ : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన బోధన అందుతుందని నర్సంపేట డీఎల్‌పీఓ రాజీవ్ అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన 'పోషణ్ బీ.. పడాయ్ బీ' అంశంపై మూడు రోజులు మండలంలోని అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వ లన చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట డీసీపీఓ మధురిమ మాట్లాడుతూ నేటీ బాలలు ఆరోగ్యంగా ఉంటేనే రేపటి భవిష్యత్ ఉంటుందని అక్షర సత్యమన్నా రు. 0–3 ఏళ్ల పిల్లలను నవచేతన పిల్లలుగా, 3–6 ఏళ్ల పిల్లలను ఆధారశిల పిల్లలుగా గుర్తించి వారి పోషణ, ఆరోగ్యాల గురించి శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, హేమలత, నజ్మ, రాధ, పారిజాతం,, పోషణ్ అభియాన్ బీసీ శ్రీలత, గ్రామ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఐలమ్మ, కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్

వర్ధన్నపేట : చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్లాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్వర్యంలో కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ అధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ వారోత్సవాలు అనే అంశంపై సెమినార్ ని ర్వహించారు. ప్రశాంత్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పో రాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామకమిటీ ఎన్నిక

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బిర్రు భాస్కర్‌ను నియమించినట్లు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య తెలి పా రు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, జిల్లా అధ్యక్షుడు తూల రవి ఆదేశాల మేరకు గ్రామనూతన కమిటీ నియామకం చేపట్టినట్లు వివరించారు. ప్రధానకార్యదర్శిగా బి ర్రు చందర్, కోశాధికారిగా బిర్రు రాజు, కార్యదర్శిగా బిర్రు భిక్షపతిలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దిలీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

పర్వతగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ మండల కేంద్రంలో యూరియా బస్తాలు వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు సోమవారం రాత్రి నుంచి సొసైటీ కార్యాలయం, రైతు వేదిక వద్ద యూరియా కోసం అక్కడే చలిలో పడుకొని పడిగాపులు కాస్తున్నారు. పదేళ్లుగా ఒక్క రైతు కూడా ఇలా రోడ్డున పడ్డ పరిస్థితి లేదని తెలిపారు.

బొడ్డెమ్మ ఆడిన మహిళలు

వర్ధన్నపేట : పట్టణంలోని 1వ వార్డులో మాజీ కౌన్సిలర్ తోటకూరి రాజ మణి ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు బొడ్డెమ్మ ఆట ఆడారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయపర్తి: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని బంధనపల్లికి చెందిన కొడగాని రమ, మైలారం గ్రామానికి చెందిన హసన్, గణేష్ కుంట తండాకు చెందిన సాయిప్రేమ్‌కు మంజూరి అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నర్సంపేట : రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

ఐరన్,ప్లైవుడ్ అసోసియేషన్ ఎన్నిక


అధ్యక్షుడు కమలాకర్‌చారి

నర్సంపేట: నర్సంపేట ఐరన్ అండ్ ఫ్లేవ్వుడ్ అసోసియేషన్ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా శేర్ల యుగేందర్, ఉపాధ్యక్షులుగా వట్టే సాంబరెడ్డి, కోశాధికా రిగా పెండెం కిరణ్, కార్యవర్గ సభ్యులుగా తక్కళ్లపల్లి గవాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరామర్శ



ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చూడి బాల్‌రెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబులు మంగళవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో యడ్ల భిక్షంరెడ్డి, వెంకటప్రసాదరావు, ముస్తఫా, లింగిడి వెంకన్న ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి..

మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎస్సై వెంకటేశ్వర్‌రావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా బాధిత కుటుంబాన్ని రిటైర్డ్ సీఐ అంబటి రవీందర్, రిటైర్డ్ ఎస్సైలు నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, సురేందర్, సంపత్‌లు పరామర్శించారు.

సర్వేను పూర్తి చేయాలి


ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌లో జరుగుతున్న పీఎం ఆవాస్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని మంగళవారం ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవాస్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, బేస్‌మెంట్ లెవల్, లెంటల్ లెవల్ ఉన్న వారు పూర్తి చేయాలని, లెంటల్ లెవల్‌లో ఉన్న వారు ఆర్‌సీసీ పూర్తి చేయాలని, ఆర్‌సీసీ పూర్తయిన వారు నిర్మాణం పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మైన విక్రమ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ బందెల వెంకన్నయాదవ్, దౌలత్‌నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కత్తుల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు దొనికి కొమురయ్య, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

డిజిటల్ ఐడెంటిటీ కార్డుల పంపిణీ



రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బొట్ల జ్యోతి సహకారంతో డిజిటల్ ఐడెంటిటీ కార్డులను అందించినట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం కుమ్మరి బాబురావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిమ్మతి దినేష్‌కన్నా జ్ఞాపకార్థం రూ.12వేల విలువ చేసే ఐడెంటిటీ కార్డులను ఆమె అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్
- 69వ ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం

నర్సంపేట : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని స్థానిక వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. చెన్నారావుపేటలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో మంగళవారం 69వ ఎస్‌జీఎఫ్ఐ చెన్నారావుపేట, నెక్కొండ జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్యానాయుడుతో కలిసి ప్రారంభించారు. ముందుగా జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, జోనల్ స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతుల దాత తొగరు చెన్నారెడ్డిలను క్రీడానిర్వాహకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంఓ ఉంద్రాతి సుజన్‌తేజ, డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, నెక్కొండ ఎంఈఓ రవికుమార్, ఉప్పరపల్లి స్కూల్ హెచ్ఎం తేజావత్ జయ, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సారంగపాణి, క్రీడల జోనల్ సెక్రటరీ వీరగోని స్వప్న, సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి


మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

ఖానాపురం : అధికారులతో పాటు ప్రైవేట్ డీలర్లు రైతులకు అండగా నిలవాలని ఏడీఏ దామోదర్ రెడ్డి, ఎస్సై రఘుపతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రైవేట్ ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు కంపెనీలు, హోల్‌సేలర్ల నుంచి యూరియా నిల్వలను తక్షణమే తీసుకొచ్చి రైతులకు అందించాలన్నారు. మండలంలో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నందున వెంటనే నిల్వలు తీసుకొచ్చి రైతులకు అందజేసి ఇబ్బందులు తొలగించాలన్నారు. టోకెన్ల పంపిణీ ఆధారంగానే డీలర్లు సైతం రైతులకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. డీలర్లకు వ్యవసాయ అధికారులు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్, ఏఓ శ్రీనివాస్, డీలర్లు మధు, నరేష్, పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని కాపాడాలి


అంగడిరోడ్డులో నిరసన తెలుపుతున్న గ్రంథాలయ యాజమాన్యం, మహిళా మండలి బాధ్యులు

నర్సంపేట : పట్టణంలోని గ్రంథాలయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతుందని గ్రంథాలయ అధ్యక్షుడు రాజు ఆరోపించారు. పట్టణంలోని అంగడిసెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేటలో ఉన్న గ్రంథాలయం, మహిళా మండలి భవనం ఎదుట అనుమతి లేకుండా గుమ్టీలను ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే గ్రంథాలయానికి ఆనుకొని ఏర్పాటు చేసిన గుమ్టీలను తొలగించి గ్రంథాలయంతో పాటు మహిళా మండలి భద్రత భవన స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజు, ప్రేమ్, సంతోష్, గణేష్, అలేఖ్య, మౌనిక, ప్రవళిక, సందీప్, రాకేష్, సునీల్, కార్తీక్, మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై ముత్యం రాజేందర్

రాయపర్తి : సైబర్‌క్రైంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ముత్యం రాజేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్‌క్రైంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ సైబర్‌క్రైం అనేది పర్సనల్, ఫైనాన్షియల్ క్రైమ్ అని అవి జరిగే విధానాన్ని వివరించారు. ఈ విషయాలపై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ఓటీపీలు ఓపెన్ చేయకూడదని వివరించారు. అమ్మాయిల అక్రమ రవాణా, మత్తుపదార్థాల వినియోగం, అనుమానాస్పద వ్యక్తులు, టీజింగ్ జరిగేటప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం,పోలీస్‌కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

జిల్లాలో యూరియా బస్తాల కోసం రైతులు తిప్పలు తప్పడం లేదు. మంగళవారం ఆయా సెంటర్లలో యూరియా బస్తాలు వచ్చాయనగానే వివిధ గ్రామాల నుంచి రైతులు అర్ధరాత్రి నుంచి పడిగాపులు కాశారు. బస్తాల కోసం పిల్లాపాపలతో క్యూలో నిల్చున్నారు. నల్లబెల్లిలో రైతుల తోపులాటలో మేడపల్లి గ్రామానికి చెందిన ఆవుల సమ్మయ్య కిందపడడంతో స్వల్పంగా గాయపడిన సంఘటన మండలంలోని రాంపూర్ రైతు వేదిక వద్ద మంగళవారం చోటు చేసుకుంది. సొసైటీ నిర్వాహకులు పోలీసు పహారా మధ్య యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ముందుకు కూపన్లు అందజేసి అనంతరం ఒక్కో రైతుకు ఒక్కొక్కటి చొప్పున బస్తాను అందజేశారు. మిగిలిన రైతులంతా శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు. పర్వతగిరి మండలంలోని కొంత మంది రైతులు ఒక్కో రైతు ఇంట్లో 20 నుంచి 50 బస్తాల వరకు రబీ పంట కోసం నిల్వ చేసుకున్నారు. పరపతి గల రైతులు యూరియా షాపుల యజమానులతో కుమ్మక్కై యూరియా నిల్వ చేసుకొని సన్న, చిన్న కారు రైతులకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని రైతు వేదిక వద్ద బారులుదీరిన రైతులు


నల్లబెల్లి : రాంపూర్ రైతు వేదిక వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు


సంగెం : గవిచర్ల రైతు వేదిక వద్ద..


నర్సంపేట : లింగాపురం స్కూల్‌లో యూరియా బస్తాల కోసం బారులుదీరిన రైతులు


దుగ్గొండి: మహ్మదాపురం సొసైటీ గోడౌన్ వద్ద


పర్వతగిరి : ఏఓ కార్యాలయం ఆవరణలో..